క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన హెచ్‌డీ ఏసీ సభ్యురాలు



ఎమ్మెల్యే శంబంగికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శారదా శంకరరావు

బొబ్బిలి: బాడంగి సీహెచ్‌సీ(సామాజిక ఆస్పత్రి) హెచ్‌డీఏసీ(ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ) సభ్యురాలిగా ఎంపిక చేసిందుకు గాను మండలంలోని డొంకినవలస మాజీ సర్పంచ్ గండి శారదా శంకరరావు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి, ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆస్పత్రి అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు.

దుష్ప్రచారం మానుకోవాలి

బొబ్బిలి: తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని, తనపై చేస్తున్న ఇటువంటి దుష్ప్రచారం మానుకోవాలని కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి అనూరాధ కోరారు. గురువారం సాక్షి విలేకరులతో మాట్లాడిన ఆమె తనపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవి కట్టబెట్టారని, పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. తామంతా వైఎస్సార్ అభిమానులమని, తమ కంఠంలో ప్రాణం ఉండగా, పార్టీ మారను అని చెప్పారు.

పశువులకు టీకాలు వేయించాలి



కూనాయవలసలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశు సంవర్ధకశాఖ సహాయకులు

తెర్లాం: గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు పాడిరైతులకు సూచించారు. మండలంలోని కూనాయవలస గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు గురువారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు ఎక్కువగా గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పశువులు వ్యాధి బారి నపడకుండా టీకాలు వేయించడం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి జె.నరేంద్ర, సర్పంచ్ బోడెల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర

బాడంగి: మండలంలో శుక్రవారం నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామగ్రామానికి మొబైల్ వాహనం ద్వారా వెళ్లి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా, రామచంద్రాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన



వప్పంగిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం, వప్పంగి గ్రామాల్లో వైఎస్సార్ కల్యాణమస్తు దరఖాస్తులను ఏపీఎం బి.గోవిందరావు గురువారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, వారి అర్హతల ధ్రువపత్రాలు చూశారు. అర్హులందరికీ పథకం వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు గురువారం నిర్వహించారు. శుక్రవారం జరిగే స్వామీ వివేకానంద 161వ జయంతి సందర్భంగా విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు లైబ్రేరియన్ లైబ్రేరియన్ కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న అంతర్ జిల్లా చెక్‌పోస్టును డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తి గురువారం పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో అన్నిరకాల వాహనాలు తనిఖీ చేస్తున్నామని, గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత పదార్థాల రవాణా జరగకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ ు పాల్గొన్నారు.

11 మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం జంక్షన్‌లో అక్రమంగా తరలిస్తున్న 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు గురువారం తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి, బొద్దూరుకు చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సరదా.. సరదాగా!

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీలు సరదా సరదాగా కొనసాగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో గురువారం జరిగిన మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడలనుద్దేశించి, కాసేపు మాట్లాడారు. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆటలో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్.



రేగిడి: ఏవీ పురంలో వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో ఎరకయ్య



వంగర: ఎం.సీతారాంపురంలో హోరాహోరీగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు



రాజాం: కబడ్డీ పోటీలో తలపడుతున్న యువకులు



తెర్లాం: కూనాయవలసలో క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న సర్పంచ్ విజయబాబు



వంగర: వాలీబాల్, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అరసాడ జట్టు



రాజాం సిటీ: పొగిరిలో ఖోఖో పోటీలు



రామభద్రపురం: వాలీబాల్ క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



రామభద్రపురం: షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారిణులు



బొబ్బిలి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికల కబడ్డీ పోటీలు



బాడంగి: గురుకుల పాఠశాల మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న ముగడ, గూడెపువలస జట్లు



బాడంగి: జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు



తెర్లాం: మండల కేంద్రంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



సంతకవిటి: కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న మామిడిపల్లి, మోదుగులపేట జట్లు

సక్రమంగా పనిచేయని ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు తప్పదు

- సోషల్ ఆడిట్ ప్రజావేదికలో డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి
- రూ.10 లక్షల మేర అవకతవకలపై రీ–వెరిఫికేషన్
- వీఆర్‌అగ్రహారం ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంపై చర్యలకు ఆదేశాలు



వీఆర్‌అగ్రహారం ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీల ప్రజావేదిక గురువారం నిర్వహించారు. ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌ఆర్‌పీ మాధవరావుతో పాటు డీఆర్‌పీలు 21 పంచాయతీల్లో జరిగిన సామాజిక తనిఖీల వివరాలు వెల్లడించారు. తొలుత పొగిరి, అంతకాపల్లి, వీఆర్‌అగ్రహారం, గుయ్యానవలస, గురవాం తదితర పంచాయతీల్లోని సామాజిక తనిఖీల నివేదికను డీఆర్‌పీ ఎం.దొరబాబు వివరించారు. ఈ పంచాయతీల్లో అంతకాపల్లి, పొగిరి పంచాయతీల్లోని ఉపాధి పనుల్లో చిన్నచిన్న లోపాలు ఉన్నాయని, వీఆర్ అగ్రహారం పంచాయతీకి సంబంధించి, మస్టర్ సీట్లో తప్పులున్నట్లు గుర్తించడాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. అదే సమయంలో అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ సుశీలను డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ప్రశ్నించగా, ఆమె ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించడంతో పాటు చర్యలకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. గుయ్యానవలస, గురవాం పంచాయతీల్లో చాలా తక్కువ పనులు జరగడంపై మండిపడ్డారు. ఎంపీడీవో బాసూరి శంకరరావుతో మాట్లాడి, మండలంలో ఉపాధి పనుల వ్యయం పెరిగేలా దృష్టిసారించాలని, శ్యాంపురం, నందబలగ, కొత్తారిపురం, సోపేరు పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల నివేదికను డీఆర్‌పీ సత్యనారాయణ వివరించారు. చెరువు గట్ల బెంచ్ కట్టే పనుల ఫొటోలు లేకపోవడంతో వాటిని వెంటనే అప్‌లోడ్ చేయాలని, ఎవెన్యూ ప్లాంటేషన్ వివరాలు సక్రమంగా లేవని ఆరోపించారు. గాత్రాజుచీపురుపల్లి, ఒమ్మి, బొద్దాం, పెనుబాక పంచాయతీల వివరాలను డీఆర్‌పీ ప్రదీప్ వెల్లడించగా, ఒమ్మిలో మస్టర్ లోపాలు ఉన్నాయన్నారు. దోసరి, ఆగూరు, కంచరాం, గడిముడిదాం పంచాయతీ సామాజిక తనిఖీల వివరాలు డీఆర్‌పీ పి. రమేష్, బొమ్మినాయుడువలస, మారేడుబాక, రాజయ్యపేట, ఎం.జీవలస పంచాయతీల ఆడిట్ వివరాలను డీఆర్‌పీ మల్లిఖార్జునరావులు వివరించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో మొత్తం 963 పనులకు సంబంధించి రూ.14,48, 94, 719 నిధులపై ఈ ఆడిట్ నిర్వహించగా, వేతనదారుల బిల్లుల చెల్లింపు, ఎవెన్యూ ప్లాంటేషన్ వివరాలు సరిగా లేనికారణంగా రూ.10 లక్షలు మేర అక్రమాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి, పీడీకి నివేదికలు అందించారు. వీటిని క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ పి.వెంకటరమణ, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ వెంకటనాయుడు, ఏపీడీలు జనార్ధనరావు, శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘాలు బాధ్యత తీసుకోవాలి

బాడంగి: పొదుపు సంఘాలతో పొదుపులు, అప్పులు సక్రమంగా కట్టించే బాధ్యతను పొదుపు సంఘాలు తీసుకోవాలని ఏపీఎం పి.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం గురువారం నిర్వహించారు. సభ్యులు సకాలంలో స్త్రీనిధి అప్పులు చెల్లించేలా చూడాలన్నారు. నాన్ పేమెంట్ మోడ్‌లోకి వెళ్లిపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. మండలంలోని వాడాడ, హరిజన పాల్తేరు, పీవీపేటకు సంబంధించి, రూ.9 లక్షల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. వీటిలో 50 శాతం మేరకు రికవరీ అయితే తిరిగి అవసరమున్న వారికి స్త్రీనిధి రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు.

పింఛన్ల పంపిణీ



రేగిడి: పింఛన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం చేపట్టారు. లబ్ధిదారులందరికీ పెంచిన పింఛన్‌తో కలిపి మొత్తం రూ.3 వేలను వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.ఉమాపాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంగర: శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు వద్ద ఉన్న జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడివాడ సింహాచలం వద్దకు మండలంలోని కోనంగిపాడు వలంటీర్ గురువారం వెళ్లి, పింఛన్ అందజేశారు. సదరు వలంటీర్ సేవలను అందరూ మెచ్చుకుంటున్నారు.

రూ.3 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం



పెనుబాకలో కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో గొలివి వీధిలో రూ.3 లక్షల వ్యయంతో సీసీ కాలువలు నిర్మిస్తున్నారు. ఈ పనులను జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు గురువారం పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఆయన వెంట పీఆర్ జేఈ ప్రభాకరరావు, తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తెర్లాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నెమలాం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99.5 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక పార్టీగా వైఎస్సార్ సీపీ రికార్డు సృష్టించిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే పార్టీని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ చదువుకోవాలి



విద్యార్థుల ఇంటికి వెళ్లి, వారు చదువుతున్నదీ లేనిదీ పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి: పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, సెలవుల్లోనూ చదువుకోవాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. గురువారం మండలంలోని గజరాయునివలస, డొంకినవలస, లక్ష్మీపురం, తెంటువలస, పెద్దపల్లి, వీరసాగరం, పిండ్రంగివలస గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి, చదువుతున్నారా లేదా అనే విషయం పరిశీలించారు. సెలవుల్లో అనవసరంగా తిరగకుండా బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక వస్త్రపురికాలనీలో నివాసముంటున్న అంకిత్ మిశ్రా అనే యువకుడు అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపారు. మిశ్రా ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 9వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటివరకు అతడు రాకపోగా, తెలిసిన వారిళ్లతో పాటు బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన తల్లి రేఖామిశ్రా ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్రాంతి సందడి



రామభద్రపురం వీధుల్లో హరిదాసునికి బియ్యం వేస్తున్న మహిళ



చొక్కాపు వీధిలో డూడూ బసవన్న విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు



ఇంటి ముందు ముగ్గు వేస్తున్న బాలికలు

పల్లెల్లో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. ఏ ఊరు చూసినా ఇళ్ల వాకిళ్ల రకరకాల రంగవల్లలతో సరికొత్తగా ముస్తాబవుతున్నాయి. ఉదయాన్నే హరిలో రంగ హరి అంటూ వచ్చే హరిదాసులు, డూడూ బసవన్నల విన్యాసాలతో పండగ వాతావరణం నెలకొంది. ఏ వీధి వెళ్లినా పిండి వంటకాల ఘుమఘుమలు చూపును అటువైపు తిప్పేలా చేస్తున్నాయి. పండగ రోజున పితృదేవతలకు బట్టలు పెట్టేందుకు పంచెలు, చీరలు కొనుగోలుకు ప్రజలు పరుగులు తీస్తుండడంతో పట్టణాల్లోని బట్టల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

–రామభద్రపురం

సీఎం జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదు

- మాయమాటలతో ప్రజలను మోసం చేసే నీకు.. ప్రజలకు మేలు చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పోలికా..
- పోలవరం నిధులను ఏటీఎంలా వాడుకున్నావన్న ప్రధాని మాటలు మర్చిపోయావా..
- టీడీపీ అధినేత చంద్రబాబుపై మండిపడ్డ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత మీకు లేదని చంద్రబాబును ఉద్దేశించి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలో ఇటీవల జరిగిన టీడీపీ బహిరంగ సభలో ప్రభుత్వం, సీఎం జగన్‌పై చంద్రబాబునాయుడు చేసిన విమర్శలను ఎమ్మెల్యే తిప్పికొట్టారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ చంద్రబాబు తీరుపై ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. గతంలో కొంత మంది హైస్కూల్ విద్యార్థులకు ఇచ్చిన సైకిళ్లు, రేషన్‌కార్డులపై మీ బొమ్మ వేసుకోలేదా అని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఎటువంటి అనుమతులు రాకుండానే హడావిడిగా శంకుస్థాపన చేస్తున్నావనే కదా అప్పటి కేంద్రమంత్రి అశోక్ మీ సభకు డుమ్మా కొట్టిన సంగతి మర్చిపోయావా అన్నారు. తోటపల్లి పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 90 శాతం పూర్తిచేస్తే చివరలో నీవు ఆ పథకం ప్రారంభం చేసుకున్న మాట వాస్తవం కాదా అన్నారు.

చంద్రం.. నీవు నేతిబీర చందం..

మాజీ సీఎం చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని, నేతిబీరకాయలో నెయ్యి ఎంత నిజమో చంద్రబాబు మాటల్లో నిజం అంతేనని ఎద్దేవా చేశారు. టీడీపీ మహానాడు కార్యక్రమంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఫ్లెక్సీ లేకపోవడంతో ఎన్టీఆర్ అభిమానులు గొడవ చేస్తే అప్పటికప్పుడు ఫొటో పెట్టించిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. పట్టిసీమ ప్రాజెక్టులో లంచాలు తిన్న సంగతి కూడా అందరికీ తెలిసిందేనన్నారు. పోలవరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్నావని సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోదీ అనిన మాటలు మర్చిపోయావా అని నిలదీశారు. ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్న నీకు, సంక్షేమ పథకాల రూపంలో రూ.2 లక్షలకు కోట్లకు పైగా డబ్బులను పేదలకు పంచిపెట్టిన సీఎం జగన్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత సీనియర్ నాయకుడువు అని నీకు అధికారం అప్పగిస్తే నీవు చేసిందేమిటని నిలదీశారు. డ్వాక్రా మహిళల బంగారు రుణాలు తీర్చేసి, మీ బంగారం మీ ఇంటికి వస్తుందని నమ్మబలక లేదా అన్నారు. అదే డ్వాక్రా మహిళలకు నాలుగు విడతలుగా మీ రుణమాఫీ చేస్తానన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నమాట నిలబెట్టుకున్నారన్నారు. తాను అనని మాటలను అన్నానని బహిరంగ సభ సాక్షిగా అనడాన్ని తప్పుబడుతున్నానన్నారు. ఆ పత్రికపై పరువునష్టం దావా కూడా వేస్తున్నట్లు చెప్పారు. ఎప్పుడైనా ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి వచ్చావా.. సింగిల్‌గా వచ్చే జగన్‌మోహన్‌రెడ్డికి పొత్తుల కోసం వెంపర్లాడే నీకు ఒక్కటేనా అని మండిపడ్డారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తుందని, అది బొబ్బిలి గెలుపుతో ప్రారంభమవుతుందన్నారు. రుణమాఫీ హామీని అమలుచేయని నీవు నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలిస్తామంటే నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. బీసీలపై కపటప్రేమ ఒలకబోసినంత మాత్రాన నీవు నీచంగా చూసిన ఘటనలు బీసీలు ఇంకా మర్చిపోలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌నాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ ఆర్.ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక డోలపేట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడని సీఐ కె.రవికుమార్ తెలిపారు. బొద్దూరు నారాయణరావు అనే వ్యక్తి రాజాం నుంచి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా, జీఎంఆర్ కళాశాల వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణరావు కాలికి గాయమైంది. ఆస్పత్రికి అతడిని తరలించగా, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.